అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- వాడవాడలా ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు
- రాజ్యాంగ నిర్మాత సేవలు స్మరించుకున్న నేతలు

పటమట(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా అంబేడ్కర్ జయంతి వేడుకలను అన్ని వర్గాల ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సేవలను నాయకులు స్మరించుకున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు అనిర్వచనీయమని విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన జీవితాన్ని సామాజిక సమానత్వానికి అంకితం చేసిన మహానుభావుడని పేర్కొన్నారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో నడిచి సమాజాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్ చైతన్య రెడ్డి, అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వీఎంసీ ప్రధాన కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు, అధికారులు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా తదితరులు



గొల్లపూడిలోని అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌కు చెక్ అందజేస్తున్న దేవదానం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా, గోదావరి గంగ, బాబు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

పటమట(విజయవాడతూర్పు): అంటరానితనాన్ని అణిచివేయాలని అంతులేని కృషిచేసిన బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వీఎంసీ అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని విజయవాడ నగరపాలక సంస్థ మినిస్ట్రీయల్ – ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. భారతదేశం నేడు ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతుందండే అందుకు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. కూలీ కొడుకు కూడా కలెక్టర్ కాగలిగిన సత్తా కేవలం భారత రాజ్యాగం మాత్రమే కల్పించిందన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ శ్రీధర్ రెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ గోపాల్ నాయక్, వెటర్నరీ డాక్టర్ సోమశేఖర్ రెడ్డి, మేనేజర్ ఏ.యు.బి.శర్మ, సి సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీహరి కృష్ణ, పి.ఎస్.భగవాన్ , అసోసియేషన్ ప్రెసిడెంట్ దారా రాంబాబు, జనరల్ సెక్రెటరీ ఎస్వీఎస్ చలం, చీఫ్ అడ్వైజర్ వీఎంవీ రమణారెడ్డి, జాయింట్ సెక్రెటరీ తుపాకుల ప్రతాప్, ట్రెజరర్ సదల నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ ఎస్వీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గుర్రం వెంకటేశ్వరరావు, ఎల్.శివ నాగ కిరణ్, వి.గోపాలకృష్ణ, బి.రాజేంద్ర చేతన్ తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం వ్యాప్తంగా..

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు పలు ప్రజా సంఘాలు ఘన నివాళులర్పించాయి. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి, అదే విధంగా పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బుద్ధా దివాకర్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయవాడ నగర అధ్యక్షుడు శీరం మల్లిబాబు, మహిళా నాయకురాలు బత్తుల గీత, శివ పాల్గొన్నారు. చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని టీనర్‌పేట టీఎంహెచ్ఎస్ స్కూల్ వద్ద స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగ, బాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు దేరంగుల రమణ, గాలి దుర్గారావు, వెంకట్రావు, మద్దిరాల కమలాకర్, అయితా కిషోర్, పాండు, కుంభా నాగేశ్వరరావు, దిద్దుకూరి శివ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల విరాళం..

గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హైస్కూల్ అభివృద్ధి నిమిత్తం నిర్వాహకులైన అంబేడ్కర్ యువజన సంఘం సభ్యుల విజ్ఞప్తి మేరకు ప్రముఖ న్యాయవాది ఎం.దేవదానం రూ.5 లక్షలను విరాళంగా అందజేశారు. డాక్టర్ ఎస్.విఠల్ రావు, ఎస్ఆర్ఆర్ కాలేజీ లెక్చరర్ కె.భాస్కరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్న కార్యక్రమానికి ఎం.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు ఆర్.సత్యనారాయణ, గోపాలం, నరసింహారావు, నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూచిపూడి తరుణ్ బాబు కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా పాల్గొని కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు ఎస్కే హయాత్ షరీఫ్, దాసి జయప్రకాష్, కెనడి, పొదిలి చంటిబాబు, జి.వినోద్ పాల్, లేళ్లపూడి లాజర్, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, డీవీ రెడ్డి, మంటి రాము, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టినగర్ పరిధిలో..

వించిపేట(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన వేడుకల్లో పోలీస్ ఇన్‌స్పెక్టర్ మేదర సుధాకర్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహా మేధావి అంబేడ్కర్ అన్నారు. అనంతరం పేదలకు మజ్జిగ పంపిణీతో పాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దళిత నాయకులు లకమాల రామారావు, చేపూరి శ్రీనివాసరావు, దాసరి ఏసు, కుంభ గంగా, మురుగు కోటి, సాదు వాసు తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో..

వాయిస్ మాల మహానాడు అధ్యక్షుడు శ్యామ్ అధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్ ముందుచూపు వలనే భారతదేశంలో దళిత, బడుగ, బలహీన వర్గాలకు సమాన హక్కులు లభించాయన్నారు. కార్యక్రమంలో షేక్ షాహినా, కుంభా గోపి, జెరా మరియదాస్ పాల్గొన్నారు.

ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో..

స్థానిక వించిపేట, నైజాంగేట్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంసీపీఐ(యూ) పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శి ఎస్డీ సలీం, సభ్యులు షేక్ అజాజ్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా ముందుకు సాగాలి

పూర్ణానందంపేట(విజయవడపశ్చిమ): ఖుద్దూస్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు 34వ డివిజన్, ఖుద్దూస్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొలిమెట్ల శరత్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ దేశంలో ఉన్న అట్టడుగు వర్గాల ప్రజల సమాన హక్కులు సాధించడంలో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం పండ్లు, బిస్కెట్‌లు పంపిణీ చేశారు. ఖుద్దూస్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చింతా లక్ష్మయ్య, జయప్రకాష్ రాజా, శంకర్, బాల, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పోతిన మహేష్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పొలిమెట్ల శరత్



చిట్టినగర్‌లో నివాళులర్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సుధాకర్, దళిత నాయకులు



ఎంసీపీఐ(యూ) నాయకుల ఆధ్వర్యంలో..



నివాళులర్పిస్తున్న వీఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, అధికారులు



బీసీ నాయకుడు బుద్ధా దివాకర్ ఆధ్వర్యంలో..

క్లుప్తంగా

250 మందికి వైద్య పరీక్షలు



వించిపేట(విజయవాడపశ్చిమ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం వించిపేటలోని శ్రీవిద్యాంజలి హైస్కూల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ పుప్పాల శ్రీనివాసరావు, వైష్ణవి విద్యాసంస్థల అధినేత నాని, వైద్య సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 250 మందికి స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా వైద్యశాల ఎండీ డాక్టర్ శ్రావణ్‌కుమార్, వైద్యులు సాయిదీపిక, తేజ, శ్రీగిరి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాత్కాలిక, సాధారణ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యూనియన్ బ్యాంక్‌లో గత దశాబ్ద కాలంగా పనిచేస్తున్న తాత్కాలిక, సాధారన సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తాత్కాలిక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంక్ తాత్కాలిక ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు తాత్కాలిక, సాధారణ ఉద్యోగులు, బెఫి, ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

స్థల విక్రయం పేరిట మోసంపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తక్కువ ధరకు స్థలం ఉందని నమ్మబలికి అడ్వాన్సుగా రూ.4.05 లక్షలు మోసం చేశారంటూ అజిత్ సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నందమూరినగర్‌కు చెందిన ఎం.శ్రీలక్ష్మి దంపతులు కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తుంటారు. వ్యాపారం వద్దకు యలవర్తి అంజలి అనే ఆమె తరచూ వచ్చి నున్న సమీపంలో తక్కువ ధరకు స్థలం ఉందని నమ్మబలికింది. స్థలం ఇప్పిస్తానని అడ్వాన్సుగా రూ.4.05 లక్షలు తీసుకున్నారు. ఈ క్రమంలో శంకర రావు అనే వ్యక్తిని తీసుకువచ్చి అతను ఎంఎస్ఆర్ డెవలపర్ రియల్ఎస్టేట్‌లో పార్టనర్ అని పరిచయం చేసింది. ఎంఎస్ఆర్ డెవలపర్ పేరిట రశీదు ఇచ్చి తగ్గిన మొత్తం ఇచ్చిన తరువాత రిజిస్ట్రేషన్ చేయిస్తామంటూ చెప్పారు. నగదు సర్దుబాటుచేసుకున్న తరువాత లక్ష్మి అంజలికి ఫోన్ చేయగా నంబరు పనిచేయలేదు. దీంతో సదరు రియల్ఎస్టేట్ కార్యాలయానికి వెళ్లి అడగగా తమ వద్ద అంజలి అనే పేరుతో ఎవరూ పనిచేయడం లేదని.. తమ వద్ద పని చేసే నాగమణి అనే మహిళ దొంగ రశీదులు ఇచ్చి మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో బాధితులు అజిత్‌సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్రీస్తు ఆరాధన కూడికలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవునికి హృదయంలో స్థానం ఇవ్వడం ద్వారా పరలోకంలో మన ఫలం అధికమవుతుందని ఆలిండియా బీసీటీసీ జనరల్ సెక్రటరీ రెవరెండ్ మంగలపూడి జోసెఫ్ అన్నారు. అజిత్‌సింగ్ నగర్ లూనా సెంటర్‌లో గిద్యోను ప్రార్థనా మందిరంలో 21వ క్రీస్తు ఆరాధన కూడిక సోమవారం పాస్టర్ నందిగం అజయ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బైబిల్‌లోని పలు విషయాలను వివరించారు. ప్రసంగికులు కలపాల జాషువా బైబిల్‌లో పొందుపరిచిన అనేక విషయాలు క్రైస్తవ సహోదరులకు తెలియజేశారు. మణిబాబు, ప్రభు భూషణం పాడిన పాటలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో ఎస్.ఇర్మియా, దొండపాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పూజ

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, మెట్లబజార్‌లోని కోదండ రామాలయంలో శ్రీ అయ్యప్పస్వామి పూజ, భజన 43వ వార్షికోత్సవం గురుస్వామి శరత్ స్వామి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు, భిక్ష స్వీకరించారు. శరత్‌స్వామి మాట్లాడుతూ గత 43 ఏళ్లుగా తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న స్వాములకు, గురుస్వాములకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం

కృష్ణలంక(విజయవాడతూర్పు): పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం సాధ్యమని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్స్(నాఫ్ క్యాబ్) డైరెక్టర్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. కార్మిక వర్గాల మధ్య పాలకులు, రాజకీయ పార్టీలు, కార్పొరేట్ శక్తులు చిచ్చుపెట్టి స్వార్థ ప్రయోజనాల కోసం చీలికలు తెచ్చే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. కార్మికులు బలహీనంగా ఉంటే యాజమాన్యం ముంగిట బలహీనపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఏపీ సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల సంఘం వజ్రోత్సవ వేడుకలు రెండో రోజు సోమవారం ముగిశాయి.



మాట్లాడుతున్న నాఫ్ క్యాబ్ డైరెక్టర్ రాఘవేంద్రరావు

సహకార చట్టాన్ని కాపాడుకోవాలి..

ముఖ్య అతిథిగా పాల్గొన్న రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. కేంద్ర పాలకుల నిరంకుశ విధానాల వల్ల సహకార బ్యాంకులు పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. కార్పొరేట్ వర్గాలకు తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చేందుకే కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లు భారీగా తగ్గిస్తోందని చెప్పారు. షెడ్యూలు బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్ముకు భద్రత లేదని, కార్పొరేట్ ఎగవేత దారులకు లక్షల కోట్ల రూపాయలు రుణ మాఫీ చేస్తున్నారన్నారు. నేడు సహకార బ్యాంకులు గొప్పగా అభివృద్ధి జరగడంలో సంఘం, సంఘం నాయకుల 60 ఏళ్ల కృషి ఉందన్నారు. ఈ 2025 సంవత్సరాన్ని సహకార సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిందని, 1904లో వచ్చిన సహకార చట్టం మన అందరిదని, దానిని కాపాడుకునే బాధ్యత మన పైనే ఉందని చెప్పారు. విశ్రాంత ప్రభుత్వ అధికారి డి.చక్రపాణి మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, డిజిటల్ రంగాన్ని సహకార బ్యాంకుల సిబ్బంది అలవర్చుకోవాలన్నారు. సంఘం జాతీయ అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి కె.వి.ఎస్.రవికుమార్, సంఘం ప్రతినిధులు వెలుగురి రాధాకృష్ణ, జి.రామకృష్ణ, అక్కినేని ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు విమర్శించారు. హనుమాన్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్య, యువత ముందున్న సవాళ్లు అనే అంశంపై సోమవారం జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలు అమలు కాలేదన్నారు. నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఎక్కడ అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్, ఎన్నికల ముందు చంద్రబాబు నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తామని ప్రకటించారన్నారు. కానీ ఇచ్చిన హామీ ఏ ఒక్కటీ అమలు కాలేదని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి..

వచ్చే నెల 15 నుంచి తిరుపతిలో జరగనున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సదస్సులో నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు, సహాయ కార్యదర్శి సింగంశెట్టి మోహన్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మందగల్ల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): భార్యను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫిర్యాది వాంబే కాలనీ హెచ్ బ్లాక్‌కి చెందిన మాలే స్వాతి. ఆమెకు మహేష్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ఒక పాప ఉంది. పెళ్లి నాటి నుంచి మహేష్ పని చేయకుండా మద్యం సేవించి భార్యను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యారంగ పరిశోధనలో ఏఐ పాత్ర కీలకం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యారంగ పరిశోధనల్లో ఆర్టిఫిషయల్ ఇంటెలిజెన్స్ టూల్స్ కీలక భూమికను పోషిస్తున్నాయని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.కృష్ణశివ ప్రసాద్ అన్నారు. కేబీఎన్ కళాశాల ఐక్యూఏసీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ సంయుక్త నిర్వహణలో సోమవారం డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు 'ఏఐ టూల్స్ ఫర్ టీచింగ్ అండ్ రీసెర్చ్' అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన కృష్ణశివప్రసాద్ మాట్లాడుతూ.. పరిశోధన సమయాన్ని ఆదా చేయడం, కచ్చితమైన సమాచారాన్ని సేకరించడానికి ఏఐ టూల్స్ ఉపయోగపడతాయన్నారు. డేటా విశ్లేషణ, డేటాకు అనుగుణంగా స్టాటిస్టికల్ కాలిక్యులేషన్స్, గ్రాఫికల్ రిప్రజెంటేషన్ అంశాల్లో ఏఐ టూల్స్ ద్వారా అత్యంత వేగంగా కచ్చితమైన ఫలితాలు పొందవచ్చునన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ.. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నప్పుడు మాత్రమే అధ్యాపకులు తమ బోధనను మెరుగుపరుచుకోవటం సాధ్యమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ అధ్యాపకులు బోధనతో పాటు పరిశోధనకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ షమీమ్, రీసెర్చ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా కమిటీ ఎన్నిక



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): లయన్స్ క్లబ్స్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించి, గుర్తింపు తీసుకురావాలని లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి చెప్పారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లోని ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్(అమ్మ) హాలులో లయన్స్ ఇంటర్నేషనల్ (డిస్ట్రిక్-316)డి స్పందన పేరుతో 27వ వార్షిక కన్వెన్షన్ ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా శేషగిరి ఆధ్వర్యంలో లయన్స్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ప్రక్రియ జరిగింది. లయన్స్ జిల్లా గవర్నర్ ఎలెక్ట్‌గా వీవీపీఎస్ ఆంజనేయులు, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఎలెక్ట్ ఎస్వీ ప్రసాద్, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఎలెక్ట్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు త్వరలోనే అమెరికాలో జరిగే కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. క్లబ్ పాస్ట్ గవర్నర్లు మిరియాల వెంకటేశ్వరరావు, శ్రీశాంతితో పాటుగా క్లబ్ సభ్యులు శంకర గుప్తా, సుంకర కృష్ణ, జిల్లాలోని వివిధ క్లబ్స్ సభ్యులు పాల్గొని ఎన్నికైన సభ్యులను అభినందించారు.

విద్యుత్ వెలుగులో అంబేడ్కర్ స్మృతివనం



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నగర వ్యాప్తంగా సోమవారం అట్టహాసంగా జరిగాయి. అంబేడ్కర్ విగ్రహాలతో పాటు చిత్రపటాల వద్ద నాయకులు ఘన నివాళులర్పించారు. వేడుకల్లో భాగంగా అంబేడ్కర్ స్మృతివనం విద్యుత్ వెలుగులో మెరిసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

గుండెపోటుతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గుర్తు తెలియని వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన ఘటన గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద చోటు చేసుకుంది. పోలీసుల విరవాల ప్రకారం.. నీలకంఠ ఆనంద్(45) అనే వ్యక్తి తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద రోడ్డుపక్కన భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం అతనికి గుండెపోటు రాగా చుట్టుపక్కల వారు గుర్తించి 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. కాగా ఆయన మార్గమధ్యలో మృతి చెందాడు. దీనిపై గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆనంద్ వివరాలు తెలిసిన వారు 0866 2576023 నంబరులో సంప్రదించాలని పోలీసులు కోరారు.